పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల, ఏప్రిల్ 8: దుర్గాబాయ్ దేశ్ ముఖ్ ప్రభుత్వ మహిళ టెక్నికల్ శిక్షణా సంస్థ హైదరాబాద్‌లో 3 ఏండ్ల పాలిటెక్నిక్ డిపొమో కోర్సులకు 2024-2025 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని జిల్లా సంక్షేమాధికారి బీ వాణిశ్రీ తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలికలు, తల్లిని లేదా తండ్రిని కోల్పోయిన బాలికలు, అక్రమ రవాణాకు గురైన బాలికలు, దివ్యాంగ బాలికలు సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్, కంప్యూటర్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ తదితర కోర్సుల్లో చేరే అవకాశం ఉన్నదన్నారు. ప్రతి కోర్సులో 60 సీట్లకు గానూ మొత్తం 240 సీట్లలో 70 శాతం తల్లిదండ్రులను కోల్పోయిన (అనాథ) బాలికలు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన నిరుపేద బాలికలకు కేటాయిస్తారన్నారు. బాలికలు అర్హత ప్రవేశ పరీక్ష రాయకున్నా కనీసం పదవ తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలని, 3 శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయించామన్నారు. ఇందులో ఎంపికైన బాలికలకు ఉచిత విద్యతో పాటు వసతిని కల్పిస్తామన్నారు. దరఖాస్తుతో కులం (అనాథ బాలికలకు అవసరం లేదు), ఆదాయ ధ్రువీకరణ (అనాథ బాలికలకు అవసరం లేదు), బోనఫైడ్ పత్రములను జతచేసి, మే 20, 2024 లోగా సమర్పించాలన్నారు. వివరాలకు బాలరక్ష భవన్‌లో గానీ, 9885497287లో సంప్రదించాలని సూచించారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

జగిత్యాల రూరల్, ఏప్రిల్8:గ్రామాల్లో డీలర్లు ఎరువుల దుకాణాల్లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అమ్మాలని డీఏవో బీ వాణి సూచించారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస రైతు వేదిక ఆవరణలో జగిత్యాల రూరల్, సారంగాపూర్ మండలాల ఇన్‌పుట్ డీలర్లతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ప్రతి డీలర్ స్టాక్ రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు. ఆయా మండలాల్లో లైసెన్స్ ఉన్నవారు మాత్రమే ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు అమ్మాలన్నారు. కొనుగోలు దారులకు రసీదు ఇవ్వాలని, ఈపాస్ యంత్రాల ద్వారా ఎరువులను విక్రయించాలని సూచించారు. సమావేశంలో ఏవో తిరుపతి నాయక్, ఏఈవోలు రమ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఈద్గా మైదానంలో ఏర్పాట్లు

మెట్‌పల్లి,ఏప్రిల్8:రంజాన్ పండుగ నేపథ్యంలో సోమవారం వెంకట్రావు పేట సమీపంలోని ఈద్గా మైదానంలో మున్సిపల్ సిబ్బంది పారిశుధ్య పనులు నిర్వహించారు. నమాజ్ వచ్చే ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లను చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మోహన్ ఆదేశించారు. ఈమేరకు పనులను ఆయన దగ్గరుండి పరిశీలించారు. ఇక్కడ శానిటరి ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్ ఉన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం

నూతన కార్యవర్గ సభ్యులు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 8: ఇబ్రహీంపట్నం లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గూడ ఎలిసే శాంతి భూషణ్, కార్యదర్శిగా బోనగిరి భూమేశ్, కోశాధికారిగా మార బుచ్చన్న ఎన్నికయ్యారు. క్లబ్ సేవల విస్తరణకు తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

భీమేశ్వరస్వామి ఆలయానికి విరాళం

మేడిపల్లి, ఏప్రిల్ 8: మేడిపల్లి మండల కేంద్రం శ్రీభీమేశ్వరస్వామి ఆలయానికి శ్రీభీమేశ్వరస్వామి కల్యాణం మహోత్సవం సందర్భంగా మేడిపల్లి ఎం పీ టీసీ-2 మకిలి దాస్ రూ 5016, బీఆర్ ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు దేశవేని కృష్ణ రూ 10,016 విరాళాన్ని సోమవారం అందజేశారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఒకరిపై కేసు నమోదు

మల్యాల, ఏప్రిల్ 8 :మండలంలోని రాంపూర్‌కు చెందిన జింక ప్రశాంత్ కొన్నేళ్లుగా ఓబులాపూర్ ఫారెస్ట్ సెక్షన్ అధికారి రత్నమ్మ వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తూ ఇసుక వాహనాలను ఆపి నగదు వసూలు చేస్తున్నాడని రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశానని ఎస్ఐ అబ్దుల్ రహీం తెలిపారు. కమ్మర్‌పల్లి , బీమారం వాగుల నుంచి ఇసుక అక్రమంగా తరలించే వాహనాలను ఆపి ప్రశాంత్ బలవంతంగా నగదు వసూలు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

విద్యాసంస్థల్లో ఉగాది సందడి

- అంబరాన్నంటిన ముందస్తు సంబురాలు
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- పచ్చడి తయారీ, పంచాంగ పఠనం

జిల్లాలోని విద్యాసంస్థల్లో సోమవారం ముందస్తు ఉగాది సంబురాలు అంబరాన్నంటాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాంప్రదాయ వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఉగాది పచ్చడి తయారీ చేసి పంపిణీ చేశారు. పలుస్కూళ్లల్లో పంచాంగ పఠనం నిర్వహించారు.

మల్యాల: లాస్య పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకల్లో విద్యార్థులు

మల్యాల, ఏప్రిల్ 8: మండల కేంద్రంలోని చౌరస్తాలో గల లాస్య ప్రాథమిక పాఠశాలలో సోమవారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఉగాది పచ్చడి చేసి పంపిణీ చేసుకున్నారు. ఇక్కడ స్కూల్ యాజమానులు రాజురావు, సుష్మారావు ఉన్నారు.

జగిత్యాల, ఏప్రిల్ 8 : జిల్లా కేంద్రంలోని పార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులందరూ ఉగాది పచ్చడి, బూరెలు పంచిపెట్టారు. ఇక్కడ సభ్యులు ఉన్నారు.

'ప్రయోగిల్లు'లో ..

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 8: మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించే లక్ష్యంతో మరిపెల్లి ప్రవీణ్ తన ఇంట్లో ఏర్పాటు చేసిన 'ప్రయోగిల్లు'లో ముందస్తు ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగు సంప్రదాయం ప్రతిబింబించేలా మహిళలు, విద్యార్థులు కలిసి ఉగాది పచ్చడి, బూరెలు, పులిహోరా, కుడుకల పేర్లు తయారు చేశారు. అలాగే ఉగాది విశిష్టతను తెలియజెప్పేలా విద్యార్థులు పెయింటింగ్ వేశారు. అనంతరం పంచాంగ పఠనం జరిపారు.

జ్ఞానోదయలో..

మెట్‌పల్లి,ఏప్రిల్8:మెట్‌పల్లి పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ,పీజీ కళాశాలలో సోమవారం ముందస్తు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఏటా ఉగాది వేడుకలను కళాశాలలో నిర్వహిస్తున్నామని ఉపన్యాసకులు తెలిపారు. ఇక్కడ కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సంతోష్ ఉన్నారు.

సంద్రపల్లి స్కూల్‌లో..

కొడిమ్యాల, ఏప్రిల్ 8: మండలంలోని సంద్రల్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఏనుగు అదిరెడ్డి అధ్వర్యంలో సోమవారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. ఉగాధి పచ్చడి తయారు చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. పండుగ విశిష్టతను వివరించారు. ఇక్కడ ఉపాధ్యాయురాలు స్వర్ణ తదితరులు ఉన్నారు.

మన్నెగూడెం ప్రాథమిక పాఠశాలలో..

మేడిపల్లి, ఏప్రిల్ 8 : భీమారం మండలం మన్నెగూడెం గ్రామం ప్రాథమిక పాఠశాలలో సోమవారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు శిరీష ఉగాది పచ్చడి తయారు చేసి ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు, విద్యార్థులకు పంపిణీ చేశారు.

గుల్లకోట పాఠశాలలో..

వెల్గటూర్, ఏప్రిల్ 8: ఎండపల్లి మండలంలోని గుల్లకోట ప్రాథమిక పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకలను ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల స్వామి ఆలయ పూజారి రంగనాథ శర్మ చే పంచాంగ పఠనం చేయించారు. అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ రమాదేవి, శ్రీకాంత్, శ్రీనివాస్, నరేశ్, శ్రీలత, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల నృత్య కేళి

మారుతీనగర్,ఏప్రిల్ 8: పట్టణంలో మెట్‌పల్లి లలిత కళా సమితి అధ్యక్షుడు మట్టెల గంగాధర్ ఆధ్వర్యంలో ఉగాది రంగస్థల నృత్య కేళిని ఎస్సారెస్పీ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారుల శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తీరుక్కోవెల లక్ష్మణస్వామి, సీనినటులు గోదురు మురళిని కాంగ్రెస్ రాష్ట్ర నేత జువ్వాడి కృష్ణారావు తదితరులు శాలువాలు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు.

మెట్‌పల్లి: జ్ఞానోదయ కళాశాలలో..

కొడిమ్యాల: పచ్చడిని విద్యార్థులకు పంపిణీ చేస్తున్న ఆదిరెడ్డి

వెల్గటూర్: గుల్లకోట పాఠశాలలో..

చిన్న జయంతికి అన్ని ఏర్పాట్లు చేయాలి

మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల, ఏప్రిల్ 8: కొండగట్టు హనుమాన్ ఆలయంలో ఈ నెల 22 నుంచి 24 వరకు నిర్వహించనున్న హనుమాన్ చిన్న జయంత్యుత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం జగిత్యాల కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమై ఉత్సవాల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 7 స్థలాల్లో పార్కింగ్ స్థలాలను ఎంపిక చేసి తాగునీరు, శానిటేషన్ సౌకర్యాలు కల్పించాలన్నారు. లడ్డూ, పులిహోర ప్రసాద విక్రయానికి 14, కేశఖండన ప్రత్యేక దర్శనం టికెట్లకు 12 కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. దీక్షాస్వాములు మాల విరమణ చేసే కోనేరువద్ద మూడు షిఫ్ట్‌ల్లో అర్చకులను అందుబాటులో ఉంచామన్నారు. భక్తుల స్నానాలకు కోనేరు వద్ద 120 షవర్ బాత్‌లు మహిళలు, పురుషులకు వేర్వేరుగా దస్తులు మార్చుకొనే గదులు, కేశ ఖండనం కోసం 1500 మంది నాయీబ్రాహ్మణులను అందుబాటులో ఉంటారన్నారు. ఆలయ పరిసరాల్లో 76 శాశ్వత, 58 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీక్ష స్వాములు కూర్చునేందుకు ప్రత్యేక పందిళ్లు, బారికేడ్లు నిర్మిస్తామని వెల్లడించారు. ఆలయ ప్రాంగ ణం, రోడ్లు, ధర్మశాలాలు, చుట్టు పక్కల పారిశుధ్య పనుల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించామన్నారు. 28 చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి కాలి నడకన వచ్చే భక్తులకు రేడియం స్టిక్కర్ల ను అందించాలని సూచించారు. ఆలయాన్ని విద్యుద్ధీపాలతో అలకరించాలని సూచించారు. ఆలయం లోపల, బయట 64 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామ ని తెలిపారు. ఐదు ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి మందులు, ఓ ఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఆలయం తరుపున రెండు బస్సులు ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా అవసరమైన నీటి సరఫరా కొండపైకి వచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అత్యవసర వైద్య సేవల కోసం రెండు అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలన్నారు. భక్తుల కోసం కోరుట్ల, వేములవాడ, కరీంనగర్, హుజూరాబాద్ తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, అదనపు ఎస్పీ వినోద్‌కుమార్, డీఎస్పీ రఘుచందర్, ఈవో చంద్రశేఖర్ ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జగిత్యాల, ఏప్రిల్ 8 : మధ్యాహ్న భోజనం వర్కర్స్ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సోమవారం కార్మికులు కలెక్టర్ యాస్మిన్‌బాషాకు సోమవారం వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ అనుబంధ యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వెన్న మహేశ్ ఆధ్వర్యం లో కార్మికులు మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు, అల్పాహరం బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ముక్రం, వెన్న మహేశ్, లక్ష్మి, సుగుణమ్మ, గౌతమి, లతా, శారద, జమున ఉన్నారు.

ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

- జగిత్యాల ఏఎస్పీ భీమ్‌రావు
- కొడిమ్యాలలో సీఐఎస్ఎఫ్ దళాల మార్చ్‌ఫాస్ట్

కొడిమ్యాలలో మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న సీఐఎస్ఎఫ్ బలగాలు

కొడిమ్యాల, ఏప్రిల్ 8: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించునోవాలని జిల్లా అడిషినల్ ఏస్పీ భీమ్‌రావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సీఐఎస్ఎఫ్ బలగాలతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ నుంచి అంగడి బజార్ మీదుగా శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర ఆలయం వరకు కవాతు నిర్వహించారు. గ్రామంలోని యువకులు, ముస్లింలు సీఐఎస్ఎఫ్ సిబ్బందిని శాలువాలతో సత్కరించి పుల మాలలు వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ప్రజల భద్రతకు భరోసానిచ్చేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ అడిషినల్ కమాండెంట్ యోగేంద్రసింగ్, డీఎస్పీ రఘుచందర్, మల్యాల సర్కిల్ సీఐ నీలం రవి, కొడిమ్యాల,పెగడపల్లి ఎస్ఐలు సందీప్, రామకృష్ణ, ఆర్ఎస్ఐ సుమన్ ఉన్నారు.

రాయికల్‌లో కుష్ఠువ్యాధి నిర్ధారణ శిబిరం

పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాయికల్, ఏప్రిల్ 8: రాయికల్ ప్రభుత్వ దవాఖానలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం కుష్ఠ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. గత నెలలో సర్వే ద్వారా గుర్తించిన 85 మంది కుష్ఠ అనుమానితులను స్క్రీనింగ్ చేశారు. ఇందులో 10 కేసులను జిల్లా కేంద్రానికి తదుపరి పరీక్షల కోసం రెఫర్ చేసినట్లు వైద్యాధికారి తెలిపారు. ముగ్గురికి వ్యాధిని నిర్ధారించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ శరీరంపై స్పర్శలేని, ఎటువంటి మచ్చలు ఉన్న వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కుష్ఠును మల్టీడ్రగ్‌థెరపీ ద్వారా నయం చేయవచ్చన్నారు. ఇక్కడ మండల వైద్యాధికారి సతీశ్, డీపీఎంవో హీ ర్యానాయక్, సీహెచ్‌వో ప్రమీల, ఆరోగ్య పర్యవేక్షకులు టీ శ్రీధర్, ఎల్‌టీ సంతోష్‌కుమార్, పవన్ ఉన్నారు.

కూరగాయల మార్కెట్‌లో వసతుల పరిశీలన

వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న కమిషనర్

కోరుట్ల, ఏప్రిల్ 8: పట్టణంలోని గడి గురుజు కూరగాయల మార్కెట్‌లో వసతులను మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి సోమవారం పరిశీలించారు. వసతులు సక్రమంగా లేవని తైబజారు రుసుం చెల్లించమని విక్రయదారులు తేల్చి చెప్పడంతో అధికారులు హుటాహుటిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కమిషనర్ కూరగాయల విక్రేతలతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకు రావాలని అధికారులకు సూచించారు. కూరగాయల వ్యాపారులు, రైతులు తై బజారు గుత్తెదారుకు సకాలంలో రుసుం చెల్లించి రసీదు పొందాలని కమిషనర్ సూచించారు.

ఉత్సాహంగా..ఉల్లాసంగా..

- దొంతాపూర్ స్కూల్‌లో ఘనంగా వీడ్కోలు వేడుకలు

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ధర్మపురి,ఏప్రిల్8: దొంతాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి విద్యార్థులకు సోమవారం వీడ్కోలు వేడుకలు ఉత్సాహంగా..ఉల్లాసంగా సాగాయి. ఈ సం దర్భంగా మండల విద్యాధికారి బత్తుల భూమయ్య మాట్లాడుతూ..విద్యార్థులు ఉన్న త లక్ష్యాలను ఎంచుకొని చదువులో ముందుకుసాగాలన్నారు. కాగా, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించా యి. ఇక్కడ ప్రధానోపాధ్యా యులు భట్టూరి రాజేశం, ఉపాధ్యాయులు సునీత, సతీశ్, సింధూజ, అనిత, రాజ్‌కుమార్ ఉన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కంట్రోల్ రూం ఏర్పాటు

కోరుట్ల, ఏప్రిల్ 8: వేసవిలో తాగునీటి ఇబ్బందుల పరిష్కారం కోసం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. తాగునీరు సరఫరాలో ఇబ్బందులు తలెత్తితే టోల్ ఫ్రీ నంబర్ 18004254346, హెల్ప్ లైన్ నంబర్ 08725299961కు ఉదయం 6:00 నుంచి సాయంత్రం 6 వరకు ఫిర్యాదు చేయవచ్చని మున్సిపల్ కమిషనర్ తిరుపతి సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

కథలాపూర్, ఏప్రిల్ 8: గ్రామాలో తాగునీటి సమస్యలపై పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. సోమవారం అంబారిపేట, కలికోట, పోసానిపేట గ్రామాల్లో పర్యటించారు. నీటి సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ట్యాంకులకు నీరందించే బోరుబావుల్లో నీళ్లు లేకుంటే అద్దెకు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్, ఎంపీవో ప్రవీణ్ ఉన్నారు.

ధాన్యం తూకం వేయాలి

పెగడపల్లి,ఏప్రిల్ 8: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వం ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తుకాన్ని వెంటనే ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. మండలంలో మండల సెర్ప్ (ఐకేపీ), పెగడపల్లి, నంచర్ల, నందగిరి సహకార సంఘాల ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. కాని ధాన్యం తూకం ఇంకా మొదలు కాకపోవడంతో రైతు లు ఇబ్బందిపడుతున్నారు. దీనికి తోడు తు ఫాన్ ప్రభావం వల్ల వర్షాలు పడే అవకాశం ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి గన్నీ సంచులను కొనుగోలు కేంద్రాలకు పంపించి, వెంటనే ధాన్యం తూకాన్ని ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పెగడపల్లి సెంటర్‌లో ఆరబోసిన ధాన్యం

మాదిగల అభ్యున్నతికి తనవంతు కృషి

- ధర్మపురి మాదిగల ఆత్మీయ సమావేశంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి,ఏప్రిల్:8: మాదిగల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. సోమవారం ధర్మపురి ఎస్‌హెచ్ గార్డెన్స్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి మా దిగల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధర్మపురిలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని, అంబేద్కర్ భవన నిర్మాణానికి ఎన్నికల కోడ్ ము గియగానే శంకుస్థాపన చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశం అనంతరం మాదిగ సంఘాల ఆధ్వర్యంలో విప్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత సం గనబట్ల దినేశ్, అంబేద్కర్ సంఘం నాయకులు పారుపెల్లి రాజమల్లయ్య, చిలుముల లక్ష్మణ్, అరికిల్ల సతీశ్, పోచయ్య, రవి ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే

పెగడపలి: బతికపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో

పెగడపల్లి, ఏప్రిల్ 8: పెగడపల్లి మండలం బతికపల్లి, శాలపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం గ్రాడ్యుయేషన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ మహేశ్వరి మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రంలో 3 నుంచి 5 సంవత్సరాల్లోపు చిన్నారులకు ఆట, పాటలతో కూడిన విద్యను అందించనున్నట్లు తెలిపారు. చిన్నారులను తప్పని సరిగా అంగన్‌వాడీ కేంద్రాలకే పంపించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తల్లుల సమక్షంలో చిన్నారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

కథలాపూర్, ఏప్రిల్ 8 : మండలంలోని తక్కళ్లపెల్లి, భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పూర్వ ప్రాథమిక విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ అంశాల్లో చిన్నారులు చూపిన ప్రతిభను తల్లిదండ్రులకు వివరించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. చిన్నారులకు అసెస్‌మెంట్ కార్డులు అందించారు. ఇక్కడ అంగన్‌వాడీ టీచర్లు కోట రజిత, తిక్క జల, అల్లాడి సంధ్య, మల్లీశ్వరీ తదితరులు ఉన్నారు.

మాస్ట్రోలో..

కథలాపూర్, ఏప్రిల్ 8 : మండలకేంద్రంలోని మాస్ట్రో హైస్కూల్‌లో యూకేజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ దీలీప్‌రావు హాజరై విద్యార్థులకు పట్టాలు అందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, ప్రిన్సిపాల్ ఆకుల రంజిత్, డైరెక్టర్లు రాజేందర్, సురేందర్ ఉన్నారు.

కథలాపూర్: చిన్నారులకు పట్టాలు అందిస్తున్న మాస్ట్రో యాజమాని దీలిప్‌రావు

29 ఏండ్లకు చిక్కిన దారిదోపిడీ నిందితుడు

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1995లో నమోదైన ఓ దారి దోపిడీ కేసులో తప్పించుకు తిరుగుతున్న నర్రా చందు అలియాస్ చంద్రయ్య (ఏ-27)ని సీఐడీ పోలీసులు ఆదివారం అరెస్టు చేసి, సోమవారం కరీంనగర్ కోర్టులో హాజరుపర్చారు. జగిత్యాలలో నమోదైన ఈ కేసును సీఐడీకి బదిలీ చేయడంతో.. నాన్ బెయిలబుల్ వారెంట్ విభా గం ఎస్పీ రాంరెడ్డికి సీఐడీ ఏడీజీ శిఖాగోయెల్ కేసును అప్పగించారు. దీంతో ఆయన ప్రత్యేకంగా బృందాన్ని ఏర్పాటు చేసుకొని నర్రా చందు వివరాలు ఆరా తీస్తూ.. నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ మండలంలో అదుపులోకి తీసుకున్నారు. 1995లో జగిత్యాల టౌన్‌లోని పెర్కపల్లి గ్రామ శివారులో ఓ డెకాయిటీ ఆపరేషన్ చేసేందుకు నిందితులంతా సమావేశమవగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు రైడ్ చేసి అందర్నీ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నకిలీ తుపాకీలు, కత్తులు, రాడ్లు, రాళ్లు, కర్రలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో చందు ప్రమేయం ఉం దని గుర్తించిన పోలీసులు అప్పుడు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. అనంతరం వాయిదాలకు రాకుండా 29 ఏండ్ల నుంచి తప్పించుకొని తిరుగుతున్నాడు. దీంతో అతనిపై నాన్ బెయిలబుల్ వారెంట్‌ను కోర్టు జారీ చేసింది. నర్రా చందును అరెస్టు చేయడంలో కీలకంగా వ్యవహరించిన సీఐడీ సిబ్బందిని ఏడీజీ శిఖాగోయెల్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నవారికి రివార్డులు అందిస్తామని ఆమె వెల్లడించారు.

హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

మల్లాపూర్, ఏప్రిల్ 8: మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ అశోక్‌పై సస్పెన్షన్